## జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఒక నామినేషన్

జూబ్లీహిల్స్,నవంబర్4 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక నామినేషన్ దాఖలయింది. బంజారాహిల్స్‌లోని షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. శనివారం స్వతంత్ర అభ్యర్థి సూదిరెడ్డి శివశంకర్ రెడ్డి మొదటి నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి నామినేషన్ స్వీకరణ చేపట్టారు. ఈఆర్ఓ సేవా ఎస్లావత్, ఏఈఆర్ఓలు.. తాసీల్దార్ నయీముద్దీన్, ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్, ఏసీపీ రాణి పాల్గొన్నారు.

## ఇంటింటికి పోలింగ్ స్టేషన్ నంబర్ల స్టిక్కర్లు

### ఓటు ప్రాధాన్యతపై కరపత్రాల పంపిణీ

జూబ్లీహిల్స్,నవంబర్4 : ప్రతి ఇంటికి పోలింగ్ స్టేషన్‌ల నంబర్లను వేయాలని జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సేవా ఎస్లావత్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్లకు ఓటు ప్రాధాన్యతతో పాటు పోలింగ్ బూత్‌లపై అవగాహన కల్పించాలన్నారు. శనివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఓటు ప్రాధాన్యతపై ఇంటింటికి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ మాట్లాడుతూ.. అర్హులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులను ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ బూత్‌లకు తరలించి వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ బూత్‌లకు రాలేని వారు ఓటు హక్కు వినియోగించుకునేలా సీనియర్ సిటిజన్లకు, పీడబ్ల్యూడీ ఓటర్లకు 12 డీ ఫారంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో ఓటరు పేరును క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ పోలింగ్ స్టేషన్‌ల నంబర్లను సూచించే స్టిక్కర్లు వేస్తూ ఓటు ప్రాధాన్యతపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓలు ఏసీపీ రాణి, ఏఎంసీలు కమల్, బాలరాజ్, యూసీడీ పీఓ హిమబిందు, ఎంటమాలజీ ఏఈ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఖర్చులకు నివేదికలు సమర్పించాలి..

జూబ్లీహిల్స్,నవంబర్4: ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులు ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి పేర్కొన్నారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల కమిషన్ వ్యయ పరిశీలకురాలు నీతూ అగర్వాల్ షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఖర్చులు, వివరాలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సేవా ఎస్లావత్, నియోజకవర్గ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదంపై అపోహలు వీడాలి

వెంగళరావునగర్, నవంబర్ 4 : ఆయుర్వేదంపై ప్రజలకు ఉన్న అపోహలు వీడాల్సిన అవసరం ఉందని ఎర్రగడ్డ ప్రభుత్వ బూర్గుల రామకృష్ణారావు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ గణేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం జాతీయ ఆయుర్వేద వారోత్సవాల్లో భాగంగా ఆయుర్వేద వైద్య పద్ధతులు, యోగా గురించి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డ ప్రభుత్వ డాక్టర్ విజయ గణేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానంగా పాఠశాల స్థాయినుంచే విద్యార్థులకు ఆయుర్వేదం పట్ల ఆసక్తిని పెంపొందించాల్సి ఉందని అన్నారు. అందులో భాగంగానే పలు పాఠశాలల్లో ఆయుర్వేద ఉత్సవాలను నిర్వహించి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో వైజ్ఞానిక ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. 1200 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు హాజరై ఆయుర్వేద వైద్యంపై తమ సందేహాలను నివృత్తి చే సుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ ప్రభుత్వ బూర్గుల రామకృష్ణారావు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, చిన్న పిల్లల విభాగ అధిపతి డాక్టర్ యశోద, డాక్టర్ సరళ, డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ సుజన, డాక్టర్ హర్ష, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగినికి ఫోన్‌లో వేధింపులు ..

వెంగళరావునగర్, నవంబర్ 4 : ఓ మహిళా ఉద్యోగినికి ఫోన్‌లో వేధింపులపై మధురానగర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ..మధురానగర్‌కు చెందిన ఓ మహిళా ఉద్యోగినికి శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. లోన్‌యాప్‌లో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి లోన్ తీసుకున్నాడని..అతను లోన్ చెల్లించడం లేదని..నీ నంబరే రిఫరెన్స్‌గా ఇచ్చాడని..అతను ఎక్కడున్నాడో చెప్పాలంటూ బాధిత మహిళను తీవ్ర పదజాలంతో దుర్భాషలాడాడు. మనస్తాపానికి గురైన ఆ మహిళా ఉద్యోగిని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- రహ్మత్‌నగర్ డివిజన్‌లో ముమ్మర ప్రచారం



రహ్మత్‌నగర్‌లో ఓపెన్‌టాప్ కారుపై ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్, నవంబర్ 4 : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం రహ్మత్‌నగర్ డివిజన్‌లోని అమర్ పాయింట్ హోటల్ వీధి, బంగారు మైసమ్మ దేవాలయం, సంతోష్‌గిరిలోని గల్లీలో బీఆర్ఎస్ ఓపెన్ టాప్ కారుపై ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజారంజకంగా ఉందని..ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మ్యానిఫెస్టోకు రూపకల్పన జరిగిందన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని తమ పార్టీ నిలబెట్టుకుంటుంని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ఈ ఎన్నికల్లో ప్రజలు తిప్పికొడ్తారని..మూడోసారి కూడా బీఆర్ఎస్ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొడుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విశ్వసిస్తారని.. విపక్షాలకు మరోసారి ఓటర్లు బుద్ధి చెప్తారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు, ప్రతి ఇంటా సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలు చేసిందని..పని చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికే పట్టం కట్టాలని..కారు గుర్తుకే ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రచారానికి ఓటర్ల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని..అడుగడుగునా స్వాగతం లభిస్తోందని .. మహిళలు మంగళ హారతులు ఇచ్చి ఆహ్వానిస్తున్నారని .. బీఆర్ఎస్‌కు ఆదరణ మరింతగా పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, అరుణ్, రాకేశ్, నజీర్, ఫయాజ్, కృష్ణ, జబ్బార్, వినోద్, లియాఖత్, ఫ్రాంక్లిన్, విశాల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రహ్మత్ నగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి వివరాలు తెలుపుతున్న కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

## మాగంటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



ఏజీ కాలనీలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య రావు

వెంగళరావునగర్, నవంబర్ 4 : జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యరావు అభ్యర్థించారు. శనివారం ఎర్రగడ్డ ఏజీ కాలనీలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే సమర్థుడైన నాయకుడు మాగంటి గోపీనాథ్ అని..మాగంటికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. ఎక్కడికి వెళ్లినా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ‘సత్యసాయి నిగమాగం’లో సిండ్రెల్లా డిజైనర్ ఎగ్జిబిషన్

వెంగళరావునగర్,నవంబర్4: శ్రీనగర్ కాలనీలోని సత్యసాయినిగమాగమంలో సిండ్రెల్లా డిజైనర్ వస్త్ర ప్రదర్శన ప్రారంభమైంది. శనివారం ప్రముఖ మోడల్స్ ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ–2023 ఊర్మిళ చౌహాన్, కుషీ నాయుడు, హిమ వర్మలు ప్రారంభించారు. సిండ్రెల్లా ఎగ్జిబిషన్స్ వ్యవస్థాపకురాలు జ్యోతి చలసాని మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ పరిశ్రమలో ఇది మొదటి డిజైనరీ ఎగ్జిబిషన్ అని.. దీపావళి సందర్భంగా ఇది ప్రారంభినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైనర్లు తమ డిజైన్‌లను ప్రదర్శిస్తున్నారన్నారు. ఎగ్జిబిషన్ 3 రోజుల పాటు ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 వరకు ఉంటుందన్నారు.

## బస్తీల్లో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచార హోరు..



అన్నానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఎర్రగడ్డ, నవంబర్ 4 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌కు మద్దతుగా పార్టీ శ్రేణుల ప్రచార హోరుతో వీధులు గులాబీమయంగా మారాయి. శనివారం బోరబండ డివిజన్‌లోని అన్నానగర్, వీకర్‌సెక్షన్, బాబా సైలానీనగర్, స్వరాజ్‌నగర్, సైట్–1, సైట్–2 కాలనీలు, రాజ్‌నగర్, తదితర బస్తీల్లో జరిగిన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సంక్షేమ ఫలాలను అందిస్తున్న కేసీఆర్ సుపరిపాలనతో తెలంగాణ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని.. ఇక్కడ జరిగిన కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను ఇంటింటికి వెళ్లి వివరించారు. అందుకే మాగంటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుం దామని నేతలు పిలుపునిచ్చారు. అన్నానగర్ ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయ్‌కుమార్, వసంతరావు, రామకృష్ణ యాదవ్, వీరేశం, మునీర్, సుల్తాన్, యూసుఫ్, ధర్మ, రజియాబేగం, రహ్మత్, మల్లేశ్, బాబూరావు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. బాబా సైలానీనగర్ ఇంటింటి ప్రచారంలో సీనియర్ నేతలు దాసరి కురుమయ్య, ప్రశాంత్, శివకుమార్, పుల్లయ్య, అబ్బు, ఆంజనేయులు, కిరణ్‌కుమార్, ముస్తఫా, చిన్నయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ

జూబ్లీహిల్స్, నవంబర్ 4 : నోబుల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ, పవర్‌మెక్ ఫౌండేషన్ సౌజన్యంతో ప్రతిభావంతులైన 35 మంది మహిళలకు నగరంలోని మలక్‌పేట్, అంబర్‌పేట్‌లోని నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రంలో 45 రోజుల కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చారు. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పవర్‌మెక్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సజ్జా లక్ష్మి, ప్రోగ్రామ్ డైరెక్టర్ తమ్మినేడి వెంకటరావు, నోబుల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ అధినేత దంతురి సురేష్ కుమార్ తదితరులు హాజరై మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

